# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...








సంపుటి : 2 | సంచిక : 302 | ఆదివారం 23 జూన్ 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




## సింగరేణిని రక్షించాల్సిన బాధ్యత కేంద్రానిది

- కార్మికుల కష్టాలు నాకు తెలుసు: కిషన్ రెడ్డి
- సింగరేణిలో కేంద్రానికి 49 శాతం వాటా ఉందని వెల్లడి
- సింగరేణి అంశాన్ని రాజకీయం కోసం ఉపయోగించుకుంటున్నారని విమర్శ
- ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచన

హైదరాబాద్

సింగరేణిని రక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి కార్మికుల కష్టాలు తనకు తెలుసునన్నారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని గుర్తు చేశారు. దీనిని కాపాడే బాధ్యత కేంద్రానికీ ఉందన్నారు. సింగరేణి అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం, విపక్షాలు రాజకీయం కోసం ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. సింగరేణి దేశంలోని - మిగతా3లో

# ముకుతాడు ఎవరికి!



- ఇద్దరు మంత్రులకు ఆ బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్..
- వారిని కట్టడిచేసేందుకేనా?
- ఇద్దరు మంత్రులకు 'అధికారిక సమాచారం' బాధ్యతలు
- మిగతా మంత్రులను కట్టడి చేసేందుకేనని అనుమానాలు
- మీడియాకు లీకులపై క్యాబినెట్‌లో వాడివేడి చర్చ
- ప్రభుత్వం అంతర్గతంగా తీసుకుంటున్న నిర్ణయాలు, చర్చిస్తున్న అంశాలను కూడా కొందరు అత్యుత్సాహంతో బయటికి చెప్తుండటంతో నష్టం వాటిల్లుతున్నదని సన్నిహితుల దగ్గర అసహనం వ్యక్తంచేసినట్టు సమాచారం

హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని మీడియాకు అందించే బాధ్యతను మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అప్పగిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. ఇతర మంత్రులను ముఖ్యంగా ముగ్గురు సీనియర్లను కట్టడి చేసేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఇలాంటి నిర్ణయం తీసుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. క్యాబినెట్‌లోని కొందరు సీనియర్ మంత్రులు తన మాట వినడం లేదని, మీడియాకు తరుచూ లీకులు ఇస్తున్నారని సీఎం భావిస్తున్నట్టు రాజకీయ వర్గాల్లో కొన్నాళ్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం - మిగతా3లో

## పోటీ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే ఆ శిక్షలు

- కఠినంగా అమలు చేయనున్న కేంద్రం
- ప్రవేశ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా
- రూ.కోటి వరకు జరిమానా విధించే అవకాశం
- నీట్, నెట్ పేపర్ లీకుల నేపథ్యంలో ఈ చట్టాన్ని నోటిపై చేయడం ప్రాధాన్యం

## తోడుదొంగల్లా తెలంగాణ ఆస్తులను తకట్టుపెడుతున్నారు




- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- 60 ఏండ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకొని పోరాటం చేసి తెలంగాణ సాధించుకున్న పార్టీ తమది
- ముఖ్యమంత్రి గద్దెపై రేవంత్ ఎక్కిన తర్వాత కాంగ్రెస్, బీజేపీ కలిసి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టుపెడుతున్న తీరు ప్రతి ఒక్క తెలంగాణ పౌరుడు గమనిస్తున్నారు
- తమ ప్రభుత్వం తెలంగాణలోని బొగ్గు గనుల అమ్మకాన్ని ఎల్లప్పుడూ వ్యతిరేకించింది
- రేవంత్, ఆయన ప్రభుత్వం చేస్తున్న అబద్ధాల ప్రచారం చూసి జోసెఫ్ గోబెల్స్ కూడా తన సమాధిలోనే తలదించుకుంటున్నారు

హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డిపై, ఆయన చెబుతున్న అబద్ధాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్, ఆయన ప్రభుత్వం చేస్తున్న అబద్ధాల ప్రచారం చూసి జోసెఫ్ గోబెల్స్ కూడా తన సమాధిలోనే తలదించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 60 ఏండ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకొని పోరాటం చేసి తెలంగాణ సాధించుకున్న పార్టీ తమదన్నారు. మరోవైపు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను వినకుండా వాటిని క్రూరంగా అణిచి, వేల మందిని చంపిన - మిగతా3లో



## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు షాక్..

- ఇక ఆ నిబంధన తప్పనిసరి
- ఉద్యోగులందరూ తప్పనిసరిగా 9.15లోపే బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని స్పష్టం
- ఆలస్యంగా వచ్చే వారిని గాడిలో పెట్టేందుకు ఈ నిర్ణయం
- 5 నిమిషాల ఆలస్యాన్ని(గ్రేస్ పీరియడ్) కేంద్రం అనుమతి

# హెల్త్ టూరిజం హబ్‌గా తెలంగాణ

- సుమారు వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు
- ప్రపంచ దేశాల నుంచి ఎవరైనా హైదరాబాద్‌కు వస్తే అన్నీ రకాల వైద్య సేవలు అందేలా దాన్ని తీర్చిదిద్దుతాం
- ఎన్టీఆర్ ఆలోచనతో ఏర్పడ్డ బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి 24ఏళ్లుగా కోట్లాది మందికి సేవలందించడం సంతోషకరం
- పేదలకు సేవలందించే ఉద్దేశంతో ఆనాడు ఎన్టీఆర్ ఆస్పత్రి నిర్మాణానికి పూనుకున్నారు.
- అభివృద్ధి, సంక్షేమంలో ప్రపంచానికి తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలవాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సుమారు వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేసి అన్ని రకాల వైద్య సేవలు అందేలా అభివృద్ధి చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రపంచ దేశాల నుంచి ఎవరైనా హైదరాబాద్‌కు వస్తే అన్నీ రకాల వైద్య సేవలు అందేలా దాన్ని తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఇందులో బసవతారకం ఆస్పత్రికి కచ్చితంగా చోటు ఉంటుందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి 24వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే, - మిగతా3లో



## సాధారణ ప్రయాణికులకు ఊరట


- రైళ్లలో జనరల్ కోచ్‌లు నాలుగుకు పెంపు
- స్లీపర్, జనరల్ క్లాస్ కోచ్‌లలో విపరీతమైన రద్దీపై ప్రయాణికులు ఆందోళన
- మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్యను రెట్టింపు చేస్తున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటన



## విలవిలలాడుతున్న మక్కా

- మండే ఎండలకు విలవిలలాడుతోంది.
- గాలిలో తేమ తగ్గిపోయి, వేడిగాలులు తీవ్రంగా విస్తుండడంతో నరకం చూస్తున్న జనం
- మక్కా గ్రాండ్ మసీదు వద్ద 51.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న హజ్ యాత్రికులు
- ఇక జోర్డాన్ ప్రాంతంలో కూడా 60 మంది వరకు చనిపోయారు
- గతంలో వేడి గాలుల వల్ల ఈ ప్రాంతంలో 41 మంది చనిపోయారు..

# విలవిలలాడుతున్న మక్కా



**మక్కా :** పవిత్ర మక్కా మాడిపోతుంది. మండే ఎండలకు విలవిలలాడుతోంది. గాలిలో తేమ తగ్గిపోయి, వేడిగాలులు తీవ్రంగా విస్తుండడంతో జనం నరకం చూస్తున్నారు. మక్కా గ్రాండ్ మసీదు వద్ద 51.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడంతో హజ్ యాత్రికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వేడిగాలులు, తీవ్రమైన ఉక్కపోత వల్ల ఇప్పటివరకు 650 మంది హజ్ యాత్రికులు మృత్యువాత పడ్డారు. హజ్ యాత్ర చరిత్రలో ఇటువంటి విషాదం గతంలో ఎన్నడూ చోటు చేసుకోలేదు. యాత్రికుల మృతి విషయాన్ని సౌదీ దౌత్య వ్యక్తులు ధ్రువీకరించారు. మరణించిన యాత్రికుల్లో 323 మంది ఈజిప్షియన్లు ఉన్నారని తెలుస్తోంది. వేడి గాలులు, ఉక్కపోత వల్ల చనిపోయిన వారి మృతదేహాలను(550 మంది) మక్కాలోని ఆల్ ముయిసెమ్ ఆసుపత్రిలో భద్రపరిచారు.. ఇక జోర్డాన్ ప్రాంతంలో కూడా 60 మంది వరకు చనిపోయారు. గతంలో వేడి గాలుల వల్ల ఈ ప్రాంతంలో 41 మంది చనిపోయారు.. ఇక వివిధ దేశాల లెక్కల ప్రకారం మొత్తంగా హజ్ యాత్రలో వేడిగాలు వల్ల చనిపోయిన వారు 577 మంది అని తెలుస్తోంది.మక్కా ప్రాంతంలో ఇస్లాం ఐదు స్తంభాలలో ఒకటిగా హజ్ నిలుస్తోంది. ముస్లింలు తమ జీవితకాలంలో ఒక్కసారైనా హజ్ ను దర్శించుకోవాలని భావిస్తారు. దీనికోసం ఎంత కష్టమైనా పడతారు. వాస్తవానికి ఈసారి హజ్ యాత్ర ప్రారంభ సమయంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయని.. గతంతో పోల్చితే ఈసారి 0.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు పెరగడం.. వేడి గాలులు తీవ్రంగా ఉండడంతో అది యాత్రికుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని సౌదీ అరేబియా అధికారులు అంటున్నారు. మక్కా గ్రాండ్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్ దాటడంతో యాత్రికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఎండ నుంచి, వేడి గాలుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు ఈజిప్షియన్లు ఇతర ప్రాంతాలకు పరుగులు తీశారు. దీంతో వారు తప్పిపోయారు. ఈ విషయాన్ని ఈజిప్ట్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సౌదీ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. అయితే వారందరినీ కూడా వడ దెబ్బ మృతుల కింద సౌదీ అధికారులు ఆ నమోదు చేసినట్టు తెలుస్తోంది. ఇక యాత్రికుల్లో 2000 మంది వడదెబ్బకు గురి కావడంతో.. వారందరికీ స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. గత ఏడాది హజ్ యాత్ర సమయంలో వివిధ దేశాలకు చెందిన 240 మంది యాత్రికులు వడదెబ్బకు గురై మరణించారు..ఈసారి వడ తీవ్రంగా ఉండడంతో మక్కా సమీపంలోని మీనా ప్రాంతంలో పాత్రికేయులు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన సేవకులు యాత్రికులకు శీతల పానీయాలు, ఐస్ క్రీమ్ పంపిణీ చేస్తున్నారు. చల్లని నీళ్లను అందిస్తుండడంతో.. ఒంటిపై పోసుకొని చల్లబరుచుకుంటున్నారు. ఎండ వేడిమి నుంచి యాత్రికులు తమను తాము రక్షించుకునేందుకు గొడుగులు, హైడ్రేట్ డ్రింకులు వాడాలని సూచిస్తున్నారు. అయితే ఆచారంలో భాగంగా మంటూ అరాఫత్ ప్రార్థన సమయంలో యాత్రికులు బహిరంగంగా ఉండాల్సి ఉంటుంది.. అలాంటి సమయంలో పైన వేడి, తీవ్రమైన ఉక్కపోత వల్ల యాత్రికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ సంవత్సరం సుమారు 1.8 మిలియన్ల మంది హజ్ యాత్రలో పాల్గొన్నారు. ఇందులో విదేశాల నుంచి 1.6 మిలియన్ల మంది వచ్చారు.. వీరందరికీ సౌదీ అరేబియా ప్రభుత్వం అపారమైన భద్రత కల్పించింది. అయితే ఈసారి ఎండలు పెరగడంతో యాత్రికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. వడదెబ్బ మృతుల్లో ఎక్కువ శాతం మధుమేహం, రక్తపోటు సంబంధిత వ్యాధులు ఉన్న వారేనని సౌదీ అరేబియా ఆస్పత్రి వర్గాలు అంటున్నాయి.

## ఉరీలో చొరబాటుకు యత్నం.. ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టిన సైన్యం..





ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్ల జిల్లాల్లో చొరబాటు ప్రయత్నాలను భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. ఉరీలోని గోహ్లాన్ ప్రాంతంలో శనివారం ఉగ్రవాదులు చొరబాటుకు ప్రయత్నించగా.. ఇద్దరిని భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ప్రస్తుతం సంఘటనా స్థలంలో ఇంకా ఉగ్రవాదులు, సైన్యం మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉగ్రవాదుల ఆచూకీ తెలియరాలేదు. వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇంతకు ముందు ఈ నెల 21న భద్రతా దళాలు ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు పాకిస్థానీ ఉగ్రవాదులను హతమార్చాయి. ఇద్దరికీ లష్కరే తోయిబాతో సంబంధాలను ఉన్నట్లుగా గుర్తించారు. ఉత్తర కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పెంచేందుకు పాక్ కుట్ర పన్నుతున్నట్లుగా గుర్తించారు. 2005 నుంచి 2015 వరకు ఈ ప్రాంతంలో ఉగ్రవాదం వ్యాపించింది. అయితే, 2019లో జమ్మూ కశ్మీర్ పోలీసుల ప్రచారంలో బారాముల్లా జిల్లాను ఉగ్రవాద రహితంగా ప్రకటించారు. భద్రతా సంస్థల ప్రకారం, స్థానిక ఉగ్రవాదుల కంటే పాకిస్తాన్ మూలాలు ఉన్న విదేశీ ఉగ్రవాదుల సంఖ్య ఇప్పటికీ ఎక్కువగా ఉంది. అయితే, వారిని క్రమంగా నిర్మూలిస్తూ వస్తున్నారు. అమర్‌నాథ్ యాత్ర కోసం జమ్మూ కశ్మీర్‌లో పారామిలటరీ బలగాను మోహరించారు. ఈసారి జమ్మూ జిల్లాకు 24 కంపెనీల అదనపు పారామిలటరీ బలగాలను తరలించారు. ఇది గతేడాది కంటే ఐదు నుంచి ఆరు కంపెనీల కంటే ఎక్కువ. అమర్‌నాథ్ యాత్ర మార్గం, యాత్రికుల బస స్థలాలు, లంగర్లు తదితర ప్రాంతాల్లో మోహరించడంతో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో తొలిసారిగా పారామిలటరీ బలగాలను కేంద్రం మోహరిస్తున్నది.

# జోధ్‌పూర్ మత ఘర్షణల్లో ఇద్దరు పోలీసులకు గాయాలు



**జైపూర్:** రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో మత ఘర్షణలు జరిగాయి. ఇరు వర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. ఒక షాపు, రెండు కార్లు, పోలీస్ వాహనానికి నిప్పుపెట్టారు. పోలీ సులు లాఠీ ఛార్జ్ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. టియర్ గ్యాస్ షెల్స్ కూడా ప్రయోగించారు. ఈ ఘర్షణలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. జోధ్‌పూర్ సుర్‌సాగర్ ప్రాంతంలోని రాజారాం సర్కిల్ సమీపంలోని ఈద్గా వద్ద కొత్తగా రెండు గేట్లను ముస్లింలు ఏర్పాటు చేశారు. ఈ విషయంపై గత కొన్ని రోజులుగా వివాదం జరుగుతున్నది. కాగా, శుక్రవారం రాత్రి 10:15 గంటల సమయంలో ఈద్గా గేట్ల ప్రారంభంపై స్థానిక హిందువులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మత ఘర్షణలు జరిగాయి. రెండు వర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. ఉద్రిక్తతలు పెరగడంతో ఒక సమూహం స్థానిక దుకాణాన్ని తగులబెట్టింది. పోలీస్ వ్యాన్‌తో సహా రెండు కార్లను ధ్వంసం చేశారు. మరోవైపు ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. అలాగే నాలుగైదు రౌండ్ల టియర్ గ్యాస్ షెల్స్ కూడా ప్రయోగించారు. రాళ్ల దాడిలో ఒక పోలీస్ అధికారి, కానిస్టేబుల్ గాయపడినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ ఘర్షణకు సంబంధించి 51 మందిని అరెస్ట్ చేసినట్లు శనివారం వెల్లడించారు.

# పోటీ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే ఆ శిక్షలు




**ఢిల్లీ:** నీట్ యూజీ 2024, యూజీసీ నెట్ ప్రవేశ పరీక్షల్లో అవకతవకలు సంచలనం సృష్టిస్తున్న వేళ.. ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలకు కేంద్రం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన కఠిన చట్టాన్ని శుక్రవారం అందుబాటులోకి తెచ్చింది. ఈ చట్టం కింద ప్రవేశ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తారు. రూ.కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రభుత్వ పరీక్షల(అక్రమాల నిరోధక) చట్టం-2024కి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఫిబ్రవరిలో ఆమోదం తెలపగా, కేంద్రం తాజాగా చట్ట నిబంధనలను నోటిఫై చేసింది. ఈ నెల 21 నుంచే ఈ చట్టం అమల్లోకి వచ్చింది. నీట్, నెట్ పేపర్ లీకుల నేపథ్యంలో ఈ చట్టాన్ని నోటిఫై చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రపతి ఆమోదం పొందిన ఈ చట్టాన్ని ఎప్పుడు అమలు చేస్తారని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని ప్రశ్నించిన మరుసటి రోజే దీనిపై నోటిఫికేషన్ వెలువడింది. ఇందుకు సంబంధించి న్యాయశాఖ నిబంధనలు రూపొందిస్తున్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు. ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్ బిల్లు ఫిబ్రవరి 6న లోక్ సభలో ఆమోదం పొందగా.. 9న రాజ్యసభ ఆమోదించింది. అదే నెల 12న రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. యూపీఎస్సీ, రైల్వే ప్రవేశ పరీక్షలు, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ నియామకాలు తదితర పరీక్షల్లో అక్రమాలను అరికట్టేందుకే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. దేశ వ్యాప్తంగా నీట్ పరీక్ష పత్రం లీకేజీ ఆందోళనలు జరుగుతున్న వేళ చట్టం అమల్లోకి తీసుకొచ్చారు.

# 22 మంది అనుమానిత ఉగ్రవాదులు అరెస్టు



లాహోర్: పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్సుకు చెందిన పోలీసులు భారీ కుట్రను భగ్నం చేశారు. సుమారు 22 మంది అనుమానిత ఉగ్రవాదులను అరెస్టు చేశారు. ఆ ఉగ్రవాదులు ఐఎస్ఐఎస్, టీటీపీతో పాటు ఇతర నిషేధిత సంస్థలకు చెందినట్లు గుర్తించారు. కౌంటర్ టెర్రరిజం డిపార్ట్‌మెంట్ ప్రతినిధి దీనిపై మాట్లాడుతూ.. ఇంటెలిజెన్స్ శాఖ ఇచ్చిన సమాచారం ఆధారంగా పంజాబ్‌లోని వేర్వేరు జిల్లాల్లో సుమారు 152 ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించామని, ఐఎస్ఐఎస్, తెహ్రీక్ ఏ తాలిబన్ పాకిస్థాన్, బలోచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ, లష్కరే ఈ జాంగ్వీ గ్రూపులకు చెందిన 22 మంది అనుమానిత ఉగ్రవాదులను అరెస్టు చేసినట్లు చెప్పారు. లాహోర్, అటాక్, షేక్‌పురా, ముజాఫర్‌ఘర్, నాన్‌కానా సాహిబ్, బవల్‌పూర్, డీజీ ఖాన్, ఫైసలాబాద్, ముల్తాన్, భవాల్‌నగర్, రావల్పిండి నుంచి వాళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఉగ్రవాదుల వద్ద నుంచి 1645 గ్రాముల పేలుడు పదార్థాలు, మూడు హ్యాండ్ గ్రానేడ్లు, ఒక ఐఈడీ బాంబు, 12 డెటోనేటర్లు, పిస్తోల్, నిషేధిత సాహిత్యాన్ని సీజ్ చేశారు. అనుమానిత ఉగ్రవాదులు పంజాబ్‌లో అఘాయిత్యానికి ప్లాన్ వేశారు, రాష్ట్రంలో ఉన్న కీలక ప్రదేశాలను, వ్యక్తులను టార్గెట్ చేయాలని భావించారు. ఉగ్రవాదులుపై 18 కేసులు బుక్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. విచారణ నిమిత్తం ఆ ఉగ్రవాదులను గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకెళ్లారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు షాక్..



ఢిల్లీ: నిత్యం ఆలస్యంగా ఆఫీసుకు వెళ్లే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ షాక్ ఇచ్చింది. కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం సీనియర్ అధికారులతో సహా ఉద్యోగులందరూ తప్పనిసరిగా 9.15లోపే బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని స్పష్టం చేసింది. ఆలస్యంగా వచ్చే వారిని గాడిలో పెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. అయితే 15 నిమిషాల ఆలస్యాన్ని(గ్రేస్ పీరియడ్) కేంద్రం అనుమతించింది. కొత్త రూల్ ప్రకారం ఉద్యోగులు.. ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విధుల్లో ఉండాలి. ఉదయం 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ సదుపాయం ఉంటుంది. ఉద్యోగి 15 నిమిషాలయినా ఆఫీస్‌కి రాకపోతే దాన్ని హాఫ్ డే సెలవుగా పరిగణిస్తారు. అయితే నెలలో రెండు రోజులకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుంది. రెండు రోజులకు మించి గ్రేస్ పీరియడ్ తర్వాత ఆఫీస్‌కు వస్తే.. అదనంగా ఆలస్యం చేసే ఒక్కోరోజు హాఫ్ డే వేతనంలో కోత విధించనున్నారు. అయితే ఉద్యోగికి %జూం% ఉంటే వాటి నుంచి హాఫ్ డే సెలవును మినహాయించనున్నారు. క్యాజువల్ సెలవులు లేకపోతే ఎర్న్‌డ్ లీవుల నుంచి తగ్గించనున్నారు. అవి కూడా లేకపోతే శాలరీలో కోత విధించనున్నారు. ఆలస్యంగా వచ్చే వాళ్లతోపాటు త్వరగా ఆఫీస్ నుంచి వెళ్లిపోయే వాళ్లకు కూడా ఈ నియమం వర్తిస్తుంది. ఈ అంశంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆఫీసులో పని ఎక్కువగా ఉన్న రోజుల్లో అదనంగా 3-4 గంటలు పని చేస్తున్నామని.. దానికి తమకు అదనంగా డబ్బులు చెల్లించట్లేదు కదా అని అంటున్నారు.

## సాధారణ ప్రయాణికులకు ఊరట..



**న్యూఢిల్లీ:** సాధారణ ప్రయాణికులకు ఊరట కలగనున్నది. రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్య నాలుగుకు పెరగనున్నాయి. స్లీపర్, జనరల్ క్లాస్ కోచ్‌లలో విపరీతమైన రద్దీపై ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్యను రెట్టింపు చేస్తున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇటీవల జరిగిన రైల్వే బోర్డు సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైలు కోచ్‌ల వార్షిక ఉత్పత్తి కంటే అదనంగా 2500 జనరల్ క్లాస్ కోచ్‌లు తయారు చేయనున్నారు. దీంతో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని అంచనా వేశారు. కాగా, ప్రస్తుతం రెండు జనరల్ కోచ్‌లు ఉన్న రైళ్లలో వాటి సంఖ్య నాలుగుకు రెట్టింపు అవుతుందని సీనియర్ రైల్వే అధికారి తెలిపారు. జనరల్ కోచ్‌లు లేని రైళ్లకు రెండు సమకూరుతాయని చెప్పారు. ఒక్కో జనరల్ కోచ్‌లో 150 నుంచి 200 మంది ప్రయాణించేలా తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రతి రోజూ అదనంగా ఐదు లక్షల మంది జనరల్ కోచ్‌లో ప్రయాణించ వచ్చని అన్నారు. మరోవైపు జనరల్ కోచ్‌ల పెంపు ప్రణాళికతో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సామర్థ్యం పెరుగుతుందని రైల్వే అధికారులు తెలిపారు. దీని కోసం 1377 స్లీపర్ క్లాస్ కోచ్‌లతోపాటు అదనంగా 2500 జనరల్ కోచ్‌లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. దీంతో జనరల్ బోగిల్లో ఏటా 18 కోట్ల మంది ప్రయాణికులు ట్రావెల్ చేసేందుకు వీలు కలుగుతుందని వివరించారు.

## పాఠ్యాంశాల్లో రాముడు, కృష్ణుడు సరే.. మరి ఆ పాపాలకు బాధ్యులు ఎవరు?



**భోపాల్ :** మధ్యప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాల విద్య, ఉన్నత విద్యలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడి గురించి పాఠ్యాంశాల్లో పొందుపరుస్తున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రకటించారు. ఈ నిర్ణయంపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్ పట్వారీ శనివారం భోపాల్‌లో స్పందించారు. ప్రభుత్వ తీసుకున్న తాజా నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. పాఠ్యాపుస్తకాల్లో అవతార పురుషులు శ్రీరాముడు, శ్రీకృష్ణుడి గురించి బోధించడం మంచిదేనన్నారు. అయితే పరీక్ష పేపర్ల లీకేజి, కుంభకోణాలు, అవినీతి వంటి పాపాలను ముందు నిరోధించాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. ప్రతి కుటుంబంలో శ్రీరాముడిని, శ్రీకృష్ణుడిని నిత్యం పూజిస్తూ ఉంటామన్నారు. అలాగే చిన్ననాటి నుంచి ప్రతీ తండ్రి.. శ్రీరాముడిలా ఆలోచించు.. ఆయనలాగా మంచిగా ఉండాలంటూ చెబుతారన్నారు. పుస్తకాల్లో ఈ అవతార పురుషుల గురించి చదవడం మంచిదే.. కానీ పేపర్ల లీకేజితో విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని నిరోధించడం మీ ప్రభుత్వ బాధ్యత కాదా? అంటూ బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీశారు. రిక్రూట్‌మెంట్స్ స్కామ్స్ వెనుకనున్న కారణాలు ఏమిటని ఈ సందర్భంగా మోహన్ యాదవ్ ప్రభుత్వాన్ని జితేంద్ర పట్వారీ సూటిగా ప్రశ్నించారు. పరీక్ష పేపర్ల లీకేజి, కుంభకోణాలు, అవినీతి వంటి పాపాలకు ఎవరు బాధ్యత వహిస్తారంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. మరోవైపు పాఠ్యాంశాల్లో శ్రీరాముడు, శ్రీకృష్ణుడి చేరుస్తామంటూ మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ప్రకటనను రామ జన్మభూమి దేవాలయం ప్రధాన పూజారీ ఆచార్య సత్యేంద్ర దాస్ స్వాగతించారు.

# ముకుతాడు ఎవరికి!

-మొదటిపేజీ తరువాయి

అంతర్గతంగా తీసుకుంటున్న నిర్ణయాలు, చర్చిస్తున్న అంశాలను కూడా కొందరు అత్యుత్సాహంతో బయటికి చెప్తుండటంతో నష్టం వాటిల్లుతున్నదని సన్నిహితుల దగ్గర అసహనం వ్యక్తంచేసినట్టు సమాచారం. మరోవైపు కొందరు మంత్రులు సైతం తమ శాఖకు చెందిన సమాచారం ఇతర మంత్రులు ఎలా చెప్తారంటూ సీఎంకు ఫిర్యాదు చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అధికారిక సమాచారాన్ని అందించే బాధ్యతను ఆ ఇద్దరు మంత్రులకు అప్పగించారని చెప్పుకుంటున్నారు. మంత్రులంతా తమ శాఖల అంశాలను మాత్రమే మాట్లాడాలని సీఎం ప్రెస్‌మీట్‌లో చెప్పిన సంగతి తెలిసిందే. దీంతో మంత్రులు ఇతర అంశాలు మాట్లాడొద్దని కట్టడి చేయడంతోపాటు ఒకవేళ మాట్లాడినా వాటికి ఎలాంటి విలువ ఉండదని సీఎం బహిరంగంగానే చెప్పినట్టయ్యింది. అయితే, ఈ నిర్ణయం ఎవరిని ఉద్దేశించి తీసుకున్నారనే చర్చ మొదలైంది. ముగ్గురు సీనియర్ మంత్రులను కట్టడి చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. వారు ప్రెస్‌మీట్ పెట్టినప్పుడు



అన్ని అంశాలపై మాట్లాడుతున్నారని, తమకు సన్నిహితులైన జర్నలిస్టులకు లీకులు ఇస్తున్నారని సీఎం దృష్టికి వచ్చినట్టు చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే 'కట్టడి' చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

**'ఇన్‌సైడ్' చెప్పొద్దు?**

మీడియాకు వరుసగా లీకులు ఇస్తుండటంపై క్యాబినెట్ సమావేశంలో చర్చించినట్టు తెలిసింది. సీఎంతో మంత్రుల సమావేశాలు, క్యాబినెట్ సమావేశాలు, ఉప సంఘం సమావేశాల సందర్భంగా జరిగే చర్చల గురించి ఎట్టి పరిస్థితుల్లోనూ బయటికి చెప్పొద్దని ముఖ్యమంత్రి స్పష్టంచేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. విషయాలు బయటికి వెళ్తే మంత్రుల మధ్య అనైక్యత ఉన్నదని బయట చర్చ జరుగుతున్నదని అనుకున్నట్టు తెలిసింది. అందుకే అధికారిక సమాచారం ఇచ్చే బాధ్యతను ఇద్దరు మంత్రులకు ఇవ్వాలని చర్చించి, నిర్ణయం తీసుకున్నారని సమాచారం. దీంతోపాటు క్యాబినెట్ సమావేశంలో బడ్జెట్‌పై చర్చ జరిగినట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత పెట్టాలా? లేదా కొనసాగుతుండగానే బడ్జెట్ ప్రవేశపెట్టొచ్చా? అని చర్చించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రానికి ఏ మేరకు నిధులు వస్తాయో తెలుస్తాయని, కాబట్టి పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతుండగానే రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టుకోవచ్చని అధికారులు చెప్పినట్టు సమాచారం. దీనిపై ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలిసింది.

## బీఆర్ఎస్ ఓడిపోయిందని బాధగా ఉంది కానీ.. పార్టీ మారే ఆలోచన లేదు : ఎర్రబెల్లి దయాకర్‌రావు

తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పందించారు. పార్టీ మారే ఆలోచన తనకు లేదని.. కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డితో కలిసి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిందని కొంత బాధ అయితే ఉందని.. కానీ పార్టీ మారే ఆలోచన ఏ మాత్రం లేదని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయామనే దానిపై రివ్యూ మీటింగ్‌లు నిర్వహించానని ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఏ మండలం, ఏ గ్రామంలో ఎలాంటి ఫలితాలు వచ్చాయి.. ఎవరు పనిచేశారనే దానిపై సమీక్షలు చేశానని పేర్కొన్నారు. ఆ సమయంలోనే తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండించానని చెప్పారు. కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్నదే తన ధ్యేయమని తెలిపారు. దానికోసమే సిద్ధంగా ఉన్నానని చెప్పారు. దయచేసి తనపై తప్పుడు ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

**రైతు భరోసా అందించడంలో ప్రభుత్వం విఫలం.. కాంగ్రెస్ సర్కారుపై మాజీ మంత్రుల మండిపాటు**

యాసంగి పంటకు ఎకరాకు రూ.10వేలతో పాటు రైతు భరోసా పథకం కింద ఎకరాలకు రూ.15వేలు సాయం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానాకాలం విడత వ్యవసాయ పెట్టుబడి



మద్దతు పథకాన్ని ప్రభుత్వం ఇంకా అమలు చేయడం లేదని మండిపడ్డారు. రుతుపవనాలకు ముందు వర్షాలు కురిసి ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నప్పటికీ రైతు భరోసా అమలుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేయడం లేదని విమర్శించారు. రైతుబంధు లక్ష్యంగా చేసుకుని అధికారంలో ఉన్న వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమి సాగుకు యోగ్యమైందేనన్నారు. ప్రతి రైతు ఆధీనంలో ఉన్న భూమిని రుజువు చేస్తూ పట్టేదార్ పాసుపుస్తకాల ఆధారంగా రైతులందరికీ రైతు బంధు సహాయం అందించడం జరిగిందన్నారు. పంటలు పండించడానికి రైతులను ప్రోత్సహించడానికి పెట్టుబడి సాయం అందించామని.. రాష్ట్రంలో దాదాపు 95 శాతం మంది రైతులు ఐదెకరాలు, అంతకంటే తక్కువ భూమి కలిగి ఉన్నారు. ఐదు నుంచి ఏడు ఎకరాలు కలిగి ఉన్న వారు ఏడుశాతం కంటే తక్కువగా ఉన్నారని చెప్పారు. 20 ఎకరాల నుంచి 54 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు కేవలం 6,488 మంది మాత్రమే ఉన్నారన్నారు. ప్రస్తుత వనకాలం సీజన్‌లో పంట పెట్టుబడికి మద్దతుగా అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం మరింత ఆలస్యం చేయకుండా రైతులకు చెల్లించాలన్నారు. రుణమాఫీ హామీపై ప్రభుత్వం కేబినెట్‌లో చర్చ కొనసాగుతోందని.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తున్నామని చెప్పి ఆగస్టు 15కు మార్చారని, హామీల అమలులో కాలయాపన చేయడం, కేసీఆర్‌ను విమర్శించడమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా మారిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో రుణమాఫీ కాకుండా మిగిలింది రూ.4వేల కోట్లు మాత్రమేనని, కేసీఆర్ హయాంలో జరిగిన రుణమాఫీని రేవంత్‌రెడ్డి తక్కువ చేసి చూపుతున్నారన్నారు. రూ.2లక్షల పంట రుణాలు ఎంత మందికి ఉన్నాయనే వివరాలు ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అప్పుడే రుణమాఫీ జరిగిందన్నట్లు మీడియా సంస్థలు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతు భరోసాపై మంత్రివర్గ ఉపసంఘం వేసి జూలై 15 దాకా డెడ్‌లైన్ పెట్టారని, అప్పటికే నాట్లు వేసే పని పూర్తవుతుందని.. సీజన్ అయిపోయాక రైతు భరోసా ఇస్తారా? అని నిలదీశారు. రైతు భరోసాకు అర్హులను ఇప్పటి వరకు ఎందుకు తేల్చలేదని ప్రశ్నించారు. 68.90 లక్షల మందికి 1.52 కోట్ల ఎకరాలకు 11 విడతల్లో రూ.72వేల కోట్లను కేసీఆర్ హయాంలో రైతుబంధు కింద ఇచ్చామని, 2,603 క్లస్టర్లు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. ప్రతి క్లస్టర్‌లో 5వేల ఎకరాలు ఉంటాయని.. డేటా అంతా రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉందని, రైతు భరోసాకు మంత్రివర్గ ఉపసంఘం వేయడం కుంటి సాకు మాత్రమేనని నేతలు మండిపడ్డారు.

## సింగరేణిని రక్షించాల్సిన బాధ్యత కేంద్రానిది...



-మొదటిపేజీ తరువాయి

ఉన్నతమైన ప్రభుత్వరంగ సంస్థల్లో ఒకటని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లోపభూయిష్ట నిర్ణయాలతో సింగరేణిని ఆర్థికంగా, నైతికంగా దెబ్బతీసిందని ఆరోపించారు. చాలావరకు నదీ తీర ప్రాంతాల్లో బొగ్గు లభ్యమవుతుందన్నారు. బొగ్గును వెలికితీసే ప్రయత్నం చేసి... ఉపాధి అవకాశాలు పెంచుతామన్నారు. నీట్ పరీక్ష వివాదంపై కూడా కిషన్ రెడ్డి స్పందించారు. నీట్ పరీక్షలో ఎలాంటి లీక్ కాలేదన్నారు. ఒక ప్రశ్నాపత్రానికి బదులు మరో ప్రశ్నాపత్రం మాత్రమే ఇచ్చారన్నారు. ఆ విషయంలోనూ చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చడం లేదన్నారు. ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి... హామీలను అమలు చేయడం లేదన్నారు. కేవలం ఉచిత ఆర్టీసీ బస్సు హామీని మాత్రమే అమలు చేశారన్నారు. ఇతర హామీలను అన్నింటిని విస్మరించారని మండిపడ్డారు.

## ప్రతిపక్ష స్థానమైనా ఉంటుందా

**హైదరాబాద్ :** నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అన్నట్టు తయారైంది కేసీఆర్ పరిస్థితి. అధికారం ఉన్నపుడు ప్రతిపక్షం లేకుండా చేయాలనే ఆయన తపన చివరికి ఆయన్నే మింగేసేలా తయారైంది. 2014 నుంచి ఇతర పార్టీల్లో గెలిచిన వారిని నయానో.. భయానో బీఆర్ఎస్‌లో చేర్చుకుంటూ వచ్చారు. 2018లోపు దాదాపు తెలంగాణలో టీడీపీ లేకుండా చేశారు. ఈ తర్వాత 2023లోపు కాంగ్రెస్ ను కూడా ఖతం చేయాలని చూశారు. దాదాపు ప్రజల్లో కూడా ఆ అభిప్రాయం క్రియేట్ చేయడంలో సక్సెస్ అయ్యారు. అయితే.. రేవంత్ రెడ్డి చేతికి కాంగ్రెస్ పగ్గాలు వచ్చిన తర్వాత సీన్ మారిపోయింది. ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. ప్రజలు ఇచ్చిన ఓటమిని గౌరవించకుండా అవకాశం దొరికిన ప్రతిసారీ.. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది.. మరో 6 నెలల్లో కేసీఆర్ సీఎం అవుతారని చెప్పడం మొదలు పెట్టారు. నిజానికి సీఎం రేవంత్ రెడ్డి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడానికి ఇష్టపడలేదు. కానీ, ప్రభుత్వాన్నే కూల్చేస్తామంటే ఎవరికైనా తప్పదు. అందుకే కాంగ్రెస్ తో కలిసి నడుస్తామని అంటున్నవారిని రేవంత్ రెడ్డికి కలుపుకొని పోతున్నారు. బీఆర్ఎస్ 40 మంది ఎమ్మెల్యేలను గెలుచుకుంటే.. పార్లమెంట్ ఎన్నికల ముందు ఐదుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరారు. ఇప్పుడు మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ కూడా హస్తం కండువా కప్పుకున్నారు. పార్టీ ఓడిపోయిన తర్వాత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రమాణ స్వీకారానికి మినహా అసెంబ్లీకి వచ్చింది లేదు. అయితే, ఇకపై వస్తానని ఆయన ప్రకటన చేశారు. కేసీఆర్ అసెంబ్లీలో అడుగు పెట్టేసరికి ఆయనకు ప్రతిపక్షహోదా కూడా దక్కేలా కనిపించడం లేదు. ఇప్పటికే కాంగ్రెస్ తో 20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. మిగిలిన వారికి బీజేపీ గాలం వేస్తుందని తెలుస్తోంది. ప్రధాన ప్రతిపక్షంగా తామే ఉండాలని బీజేపీ గట్టిగా ప్రయత్నిస్తోంది.



ఏది ఏమైనా రోజులు లేదంటే కొన్ని నెలల్లో అసెంబ్లీలో బీజేపీ కంటే బీఆర్ఎస్ తక్కువ సంఖ్యా బలానికి పడిపోతుందని గులాబీ నేతలే చెబుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో చాలా స్థానాల్లో డిపాజిట్లు కూడా రాకపోవడంతో ఇక బీఆర్ఎస్ కు భవిష్యత్ లేదని ఫిక్స్ అయ్యారట. అందుకే ఎవరి దారి వారు చూసుకుంటున్నారని తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోవడం ఒక ఎత్తు అయితే.. ఓటమికి బీఆర్ఎస్ అధినేతే కారణమని ఆ పార్టీ నేతలు అంటున్నారు. కాంగ్రెస్ మీద కోపంతో బీజేపీకి ఆయనే స్వయంగా ఓటు బ్యాంక్ సిఫ్ట్ చేశారనే వాళ్లు కూడా ఉన్నారు. దీంతో.. పార్టీకి భవిష్యత్ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే మెజారిటీ ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డితో మంతనాలు మంతనాలు జరుపుతున్నారు. వారంతా హస్తం గూటికి చేరే అవకాశం ఉంది. మిగిలిన వారు టైం చూసి బీజేపీలో చేరే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. కేసీఆర్ ఫిరాయింపులను అడ్డుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించినా లాభం లేదని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అధికారంలో ఉన్నపుడు పార్టీ నేతలకు అందుబాటులో లేకుండా.. ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా.. ఇప్పుడు తలపట్టుకుంటే ప్రయోజనం ఏంటనే వారు కూడా ఉన్నారు. కనీసం అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినపుడైనా.. ప్రజల్లో తిరిగితే బాగుండేదనే అభిప్రాయాన్ని ఆ పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఓటమిని గౌరవిస్తున్నామని కూడా చెప్పకపోతే.. ప్రజలు ఆదరించరు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత అసెంబ్లీకి వెళ్లకుండా, ఒక ప్రెస్ మీట్ పెట్టకుండా, ప్రజల్లోకి వెళ్లకుండా.. లోక్‌సభ ఎన్నికల సమయానికి బస్సు యాత్ర చేస్తే ప్రజలు ఎందుకు నమ్ముతారు? గెలుపు ఓటములు పక్కన పెడితే.. ప్రతిపక్షమే లేకుండా చేయాలనే ప్రయత్నం ఇపుడు బీఆర్ఎస్ పార్టీని నిలువునా దహించేస్తుంది. చూస్తుండగా పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నా.. ప్రశ్నించే సాహసం చేయలేని పరిస్థితి కేసీఆర్ కు ఎదురైంది. ఒకవేళ ప్రశ్నిస్తే.. ఆ ప్రశ్నలకు ముందు కేసీఆరే సమాధానం చెప్పాలి.

## హెల్త్ టూరిజం హబ్‌గా తెలంగాణ

-మొదటిపేజీ తరువాయి

బసవతారకం ఆస్పత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ, ఎంపీ నామా నాగేశ్వరరావు, ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..” ఎన్టీఆర్ ఆలోచనతో ఏర్పడ్డ బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి 24ఏళ్లుగా కోట్లాది మందికి సేవలందించడం సంతోషకరం. పేదలకు సేవలందించే ఉద్దేశంతో ఆనాడు ఎన్టీఆర్ ఆస్పత్రి నిర్మాణానికి పూనుకున్నారు. ఆయన ఆలోచనా విధానాలు కొనసాగించాలని ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబు అప్పట్లో దీని నిర్మాణం పూర్తి చేసి పేదలకు సేవలు అందించేలా తీర్చిదిద్దారు. వైద్య సేవలు అందుతున్న తీరు చూసి ఎన్టీఆర్ స్వర్గం నుంచి మనల్ని ఆశీర్వదిస్తారు. ఆస్పత్రికి సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది. నందమూరి బాలకృష్ణ ఆస్పత్రి 25వ వార్షికోత్సవానికి రావాలని కోరుతున్నారు. 30వ వార్షికోత్సవానికి కూడా నేనే ముఖ్యమంత్రి హోదాలో వస్తా. ఆస్పత్రి లీజ్ వివాదాన్ని క్యాబినేట్ నిర్ణయం తీసుకుని పరిష్కరించాం” అని అన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో ప్రపంచానికి తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. గతంలో 12గంటలు పని చేస్తే చాలు అనుకునే వాడినని కానీ పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి 18గంటలు పని చేసే వ్యక్తి అన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో పోటీ పడి పని చేసే అవకాశం వచ్చిందని.. ఒక ఆటగాడి నైపుణ్యం తెలియాలంటే మరొక మంచి ఆటగాడితో పోటీ పడాలని అన్నారు. చంద్రబాబు ఏపీలో ముఖ్యమంత్రి కావడంతో తనతో సహా అధికారులంతా 18గంటలు పని చేయాల్సిన అవసరం ఏర్పడిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పేదలకు సేవలందించే ఉద్దేశంతో ఆనాడు ఎన్టీఆర్ ఈ ఆసుపత్రి నిర్మాణానికి పూనుకున్నారు. ఎన్టీఆర్ ఆలోచన విధానాలను కొనసాగించాలని చంద్రబాబు నాయుడు ఆసుపత్రిని పూర్తి చేసి పేదలకు సేవలు అందించేలా చేశారు. పేదలకు వైద్య సేవలు అందించాలన్న ఎన్టీఆర్ ఆలోచనలు అమలవుతున్న తీరు చూసి ఆయన మనల్ని స్వర్గం నుంచి ఆశీర్వదిస్తారు. ఆసుపత్రికి సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా మా ప్రభుత్వం అండగా ఉంటుంది. అభివృద్ధి, సంక్షేమంలో చంద్రబాబు నాయుడుతో పోటీ పడి పని చేసే అవకాశం నాకు వచ్చింది.. అభివృద్ధి, సంక్షేమంలో ప్రపంచానికి తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలవాలి. తెలంగాణలో హెల్త్ టూరిజం హబ్ ను ఏర్పాటు చేయాలని మా ప్రభుత్వం ఆలోచిస్తోంది. అన్ని రకాల వైద్య సేవలు అందేలా హెల్త్ టూరిజం హబ్ ఉంటుంది. ఇందులో బసవతారకం ఆసుపత్రికి చోటు ఖచ్చితంగా ఉంటుంది. వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్ ను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. ప్రపంచ దేశాల నుంచి ఎవరైనా హైదరాబాద్ కు వస్తే అన్ని రకాల వైద్య సేవలు అందుతాయనేలా తీర్చిదిద్దుతాం. రాజకీయం, సంక్షేమం ఎన్టీఆర్ వారసత్వంగా ఇచ్చారు. ఎన్టీఆర్ మూడో తరం కూడా దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నాని అన్నారు..

## తోడుదొంగల్లా తెలంగాణ ఆస్తులను తకట్టుపెడుతున్నారు..



-మొదటిపేజీ తరువాయి

పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. ముఖ్యమంత్రి గద్దెపై రేవంత్ ఎక్కిన తర్వాత కాంగ్రెస్, బీజేపీ కలిసి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టుపెడుతున్న తీరు ప్రతి ఒక్క తెలంగాణ పౌరుడు గమనిస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, తమ ప్రభుత్వం తెలంగాణలోని బొగ్గు గనుల అమ్మకాన్ని ఎల్లప్పుడూ వ్యతిరేకించిందన్నారు. అందుకే ప్రభుత్వం ఏ రోజూ వేలంలో పాల్గొనలేదని చెప్పారు. కానీ నేడు కాంగ్రెస్ పార్టీ నిస్సిగ్గుగా వేలంలో పాల్గొని తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ కొడుతుందని తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో తెలంగాణ బొగ్గు గనులను వేలం వేసిందని, కానీ బీఆర్ఎస్ వ్యతిరేకించడంతో ఇప్పటిదాకా అక్కడ నుంచి ఒక తట్టెడు బొగ్గు కూడా ఆ కంపెనీలు ఎత్తలేదని తెలిపారు. వేలంలో గనులను దక్కించుకున్న రెండు కంపెనీలు కేవలం బీఆర్ఎస్ పార్టీ సింగరేణి ప్రయోజనాల కోసం నిలబడడంతోనే మైనింగ్ ప్రారంభించలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ.. గనులను కేటాయించినా, కేవలం రాష్ట్ర ప్రభుత్వ కఠిన వైఖరి, నిబద్ధత వల్లనే ఆ కంపెనీలు సింగరేణి బొగ్గును తవ్వలేకపోయాయని చెప్పారు. ఆ పూర్తి క్రెడిట్ బీఆర్ఎస్‌కు దక్కుతుందన్నారు. కానీ రేవంత్ పేర్కొన్న ఆ రెండు కంపెనీలు మహారాష్ట్రలో కాంగ్రెస్, శివసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు టాక్లి, జెన, బెల్లోర గనులను దక్కించుకున్న విషయం మర్చిపోవద్దని హితవు పలికారు. తెలంగాణ ప్రజల హక్కులను, ఆస్తులను, వనరులను తాకట్టు పెట్టడంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు తోడుదొంగల్లా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నదీ జలాల వాటాను వదులుకున్న కాంగ్రెస్ తీరును రాష్ట్ర ప్రజలు తెలుసుకున్నారని చెప్పారు. తాజాగా బీజేపీకి అందిస్తున్న సహకారంతో సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేయాలన్న కుట్ర అందరికీ తెలిసిపోయిందని వెల్లడించారు. గనుల వేలంలో పాల్గొన్న మిమ్మల్ని, మీ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని తెలంగాణ చరిత్ర క్షమించదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్రానికి మీరు, మీ జాతీయ పార్టీలు చేస్తున్న ద్రోహానికి ప్రజలు సరైన సమయంలో ప్రజలు బలమైన గుణపాఠం చెప్తారని కేటీఆర్ అన్నారు.


## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై నందమూరి బాలకృష్ణ ప్రశంసలు

**బసవతారకం ఆసుపత్రి సేవల విస్తరణకు సహకరించాలని కోరగానే అంగీకరించారన్న బాలకృష్ణ**

**రేవంత్ రెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారన్న హిందూపురం ఎమ్మెల్యే**

**తన తండ్రి దూరదృష్టితో ఈ ఆసుపత్రిని నిర్మించారన్న బాలకృష్ణ**

బసవతారకం ఆసుపత్రి సేవల విస్తరణకు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరిన వెంటనే అంగీకరించారని హిందూపురం నియోజకవర్గం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. రేవంత్ రెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. శనివారం హైదరాబాద్‌లో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి 24వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆసుపత్రి ఛైర్మన్ బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ... క్యాన్సర్ మహమ్మారి ప్రజలను పట్టి పీడిస్తోందన్నారు. తన తండ్రి ఎన్టీఆర్ దూరదృష్టి కలిగిన వ్యక్తి అని... ఆ కారణంగానే మంచి ఆలోచనతో ఈ ఆసుపత్రిని నిర్మించారని పేర్కొన్నారు. నాడు బండలతో నిండిన ఈ ప్రాంతంలో బసవతారకం ఆసుపత్రిని నిర్మించారని తెలిపారు. ఇక్కడ రోగులకు మంచి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు రూ.6 కోట్లు మంజూరు చేసి... ఆసుపత్రి అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. ఇంత గొప్ప ఆసుపత్రికి తాను ఛైర్మన్‌గా ఉన్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.



# మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

**గంజాయి సాగు,రవాణా జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలి**

**జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** జిల్లాలో మాదక ద్రవ్యాలు నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఐసిసి సముదాయము జిల్లా కలెక్టరేట్ లోని వీడీయో కాన్ఫరెన్స్ సమావేశమందిరంలో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై పోలీస్ శాఖ, ఆబ్కారీ శాఖతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. యువత చెడు అలవాట్ల వైపు ఆకర్షితులైతే వచ్చే నష్టాలు, కుటుంబంలో మన తల్లి దండ్రులు, మన కుటుంబీకులు పొందే దుఃఖం వివరిస్తూ చెడు అలవాట్లకు మొదటి నుంచి దూరంగా ఉండేలా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. నేటి యువత రేపటి భావి భారత పౌరులని, వీరిలో కొంతమంది డ్రగ్స్ కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందని, దీనిని గుర్తించి డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన పెంచుకొని దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలో డ్రగ్స్ తో పాటు, గుట్కా, గంజాయి, మాదక ద్రవ్యాలు, సిగరెట్ మొదలగు చెడు అలవాట్లకు సైతం దూరంగా చేయాలనీ అన్నారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు మాదకద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో గంజాయి సాగు, రవాణా జరగకుండా కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యాలయాలకు దూరంలో మద్యం షాపులు ఉండాలని, బెల్ట్ షాపులపై కంప్లైంట్ వస్తె మూసి వేయించి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, స్కూల్ కు దగ్గర ఉన్న కిరాణా, పాన్ షాపులను తనిఖీ చేయాలని, అక్కడ సిగరెట్, పొగాకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి సంజీవరావు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి నవీన్ చంద్ర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గాయత్రీదేవి, మహిళా శిశు సంక్షేమాధి కారిణీ వసంతకుమారి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారులు, ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల ప్రిన్సపల్స్, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల త్రాగునీటి కష్టాలు

**వర్షాకాలం వచ్చినా కూడా తప్పని త్రాగునీటి కష్టాలు**

**త్రాగునీరు కోసం కిలోమీటర్ల మేర ప్రయాణం**

**త్రాగు నీటి కష్టాలు తొలగించాలని గిరిజనుల డిమాండ్**



**వికారాబాద్ :** యాలాల మండలం తొప్పర్లగడ్డ తండాలో త్రాగునిటి కష్టాలు. వర్షాకాలం వచ్చినా కూడా గిరిజనులకు నీటి కష్టాలు తప్పడం లేదు. కిలోమీటర్ల మేర తాగునీటి కోసం అవస్థలు పడాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలో మిషన్ భగీరథ ఉన్నా కూడా తాగునీరు అందని పరిస్థితి. త్రాగునీరు అందించాలని గిరిజనవాసులు వాపోతున్నారు. ఈ త్రాగునీటి కష్టాలు వికారాబాద్ జిల్లా మండల పరిధిలోని సంగయ్యగుట్ట తాండ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన తొప్పర్ల గడ్డ తాండ నెలకొంది. సీఎం సొంత జిల్లా పరిధిలోని యాలాల మండలం తొప్పర్ల గడ్డ తండాలో తాగునీటి కోసం గిరిజనులు పడుతున్నారు.గుప్పెడు నీటి కోసం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి త్రాగునీరు తీసుకుని వస్తున్నారు. గత ప్రభుత్వ0 అందించిన మిషన్ భగీరథ పథకం ద్వారా వచ్చే నీరు నల్లాలకే పరిమితం అయ్యాయి కానీ నీరు మాత్రం ఉపయోగంలోకి రాలేదు. సంగయ్యగుట్ట గ్రామపంచాయతీ పరిధిలోని తొపెర్లగడ్డ తండాలో సుమారు 50 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి రోజు త్రాగునీటి ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు. గతంలో వ్యవసాయ పొలం ఉన్నటువంటి బోరు నుండి నీటిని సరఫరా చేసేవారు. ఇప్పుడు ఆ బోర్డు నుండి నీటి సరఫరా ఆగిపోవడంతో తండావాసులు తీవ్రంగా తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి వెంటనే తమకు తాగునీటి కష్టాలు తీర్చాలని గిరిజన తండావాసులు మీడియా ముందు వాపోయారు.

# దొంగను కొట్టి చంపిన స్థానికులు

**హైదరాబాద్ :** సికింద్రాబాద్‌లో అర్ధరాత్రి సెల్ ఫోన్ స్నాచింగ్ ముఠా హల్‌చల్ చేసింది. వీరని పోలీసులు పట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ క్రమంలోనే వారిపైకి కాల్పులు జరిపినట్టు సమాచారం. అయితే పోలీసులు వెర్షన్ వేరేగా ఉంది. సికింద్రాబాద్‌లో సెల్ ఫోన్ స్నాచింగ్ చేస్తున్న ముఠా తిరుగుతోంది. ఎప్పటి నుంచో ఫిర్యాదులు అందుకుంటున్న పోలీసులు నిన్న రాత్రి సడెన్ విజిట్ చేశారు. అప్పటికే ఆ ప్రాం తంలో ఉన్న ఆ ముఠా పారిపోయేందుకు యత్నించింది. పారిపోతున్నా దొంగల ముఠాను పట్టుకునేందుకు పోలీసులు వెంబడించారు. ఈ క్రమంలోనే కాల్పులు జరిపినట్టు తెలుస్తోంది. సెల్ ఫోన్ స్నాచింగ్ ముఠాపై ఒక రౌండ్ కాల్పులు చేశారని అంటున్నారు. చివరకు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి పారిపోయే క్రమంలోజరిగిన పెనుగులాటలో మిస్‌ఫైర్ అయిందని పోలీసులు చెబుతున్నారు. అసిఫ్ నగర్ పీఎస్ పరిధిలోని ఓ ఇంట్లో దొంగతనానికి ఓ వ్యక్తి చొరబడ్డాడు. ఈ క్రమంలోనే శబ్దాలు వచ్చాయి. వెంటనే నిద్రలేచిన ఆ ఇంట్లోని వ్యక్తులు దొంగను పట్టుకున్నారు. దొరికిన వ్యక్తిని పోలీసులకు ఫోన్ చేసి అప్పగించే లోపు రెండు దెబ్బలు వేశారు. ఇంతలో పోలీసులు రానే వచ్చారు. తీవ్ర గాయాలతో ఉన్న అతన్ని స్థానిక ఆసుపత్రికి తరలిం చారు. ఇలా తరలిస్తుండగానే ఆ వ్యక్తి చనిపోయాడు. అసలు ఆ వ్యక్తి ఎవరు అనేది మాత్రం పోలీసులకు తెలియడం లేదు. దీనిపై విచారణ చేస్తున్నారు.

**ఉద్యోగాలు ఇస్తామని మోసం**

జిహెచ్ఎంసిలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం ఓవ్యక్తి కొందరిని మోసం చేశాడు. సర్కిల్ 19 యూసఫ్ గూడ పరిధిలోని బోరబండ సైట్ 2 లో ఎస్ఎఫ్ఏగా పనిచేస్తున్న శ్రీనివాస్ ఈ పని చేశాడు. తన కింద పనిచేసే కొంతమంది మహిళలను బెదిరించి ఉద్యోగం మాన్పించాలనే యత్నించాడు. ఆ ఉద్యోగాల్లో వేరే వాళ్లను నియమించాలని చూశాడు. దీని కోసం లక్షల్లో వసూలు చేశాడు. నిత్యం వివాదాల్లో ఉండే శ్రీనివాస్‌పై ఇటీవల బోరబండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. శానిటేషన్ సిబ్బంది రాకపోయినప్పటికీ సంతకాలు ఫోర్జరీ చేసి డబ్బులు తీసుకునేవాడు. ఇన్ని ఆరోపణలు ఉన్నప్పటికీ అతనిపై చర్యలు తీసుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు.

# 14 రోజులు దర్శనం ఇవ్వని జగన్నాధుడు



**భువనేశ్వర్ :** పూరీలోని జగన్నాథ ఆలయంలో ప్రతి సంవత్సరం జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తారు. జగన్నాథుని ఈ రథయాత్ర ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఏడాది కూడా జగన్నాథ రథయాత్రకు ఉత్సాహంగా సన్నాహాలు చేస్తున్నారు. జగన్నాథ రథయాత్రకు ముందు.. సహస్రధార స్నాన ఆచారం నిర్వహించబడుతుంది. ఆ తర్వాత హిందూ విశ్వాసం ప్రకారం 14 రోజుల పాటు స్వామిని భక్తులు దర్శనం చేసుకోలేరు.జ్యేష్ఠ మాసంలోని పౌర్ణమి రోజున సహస్రధార స్నానం చేస్తారు. ఆ రోజును "దేవ స్నాన పూర్ణిమ" అని కూడా అంటారు. ఈ రోజున ఆలయ ప్రాంగణంలోని భారీ సంఖ్యలో భక్తులు భారీగా తరలిరానున్నారు. ఈ నేపధ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సంవత్సరం దేవ స్నాన పూర్ణిమను జూన్ 22, 2024 శనివారం జరుపుకుంటారు.ప్రతి సంవత్సరం జ్యేష్ఠ మాసం పౌర్ణమి రోజున పూరీలోని జగన్నాథ దేవాలయంలో జగన్నాథుడు, అతని సోదరుడు బలరాముడు, సోదరి సుభద్రలకు సహస్రధార స్నాన ఆచారం నిర్వహిస్తారు. ఈ ఆచారం చాలా వైభవంగా జరుపుతారు. సహస్ర ధార స్నానానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఈ ఆచారం జగన్నాథుని రథయాత్రకు నిర్వహించే ప్రధాన ఆచారాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. ఈ క్రతువు కోసం స్వామిని 108 కుండలలో పవిత్ర జలం నింపి స్నానం చేస్తారు. ఈ సంవత్సరం దేవ స్నాన పూర్ణిమ జూన్ 22న వచ్చింది. అందుకే ఈ రోజు జగన్నాథుడు, అన్న బలభద్రుడు, సోదరి సుభద్రలకు సహస్ర ధార స్నాన ఆచారం నిర్వహించబడుతుంది.దేవ స్నాన పూర్ణిమ రోజున జగన్నాథుడు, బలభద్రుడు ,సుభద్ర దేవిని భక్తుల ముందు స్నానం చేయించడానికి తీసుకువస్తారు. ఈ ఆచారాన్ని చూసేందుకు భారీ సంఖ్యలో భక్తులు పూరీకి చేరుకుంటారు. ఈ సమయంలో దేవతా మూర్తులను స్నాన మండపానికి తీసుకొచ్చి ఆలయంలోని పవిత్ర బావిలోని నీటిలో స్నానం చేయిస్తారు. ఈ కాలంలో అనేక రకాల మతపరమైన ఆచారాలు కూడా జరుగుతాయి. పూలు, గంధం, కుంకుమ, కస్తూరి వంటి వాటిని 108 కుండల నీటిలో కలిపి స్నానం చేయడం వల్ల స్నానం చేసే నీరు మరింత స్వచ్ఛంగా.. సువాసనగా మారుతుంది.స్నాన ఆచారం పూర్తయిన తర్వాత జగన్నాథునికి సాధారణ వస్త్రధారణ చేస్తారు. జగన్నాథుడు సాధారణ దుస్తులు ధరించి ఉంటాడు. మధ్యాహ్నం సమయంలో జగన్నాథుడిని వినాయకుని రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. భగవంతుని వేషధారణలో జరిగే ఈ ఆచారం చాలా ముఖ్యమైనదిగా పరిగణించబడుతుంది. భగవంతుడు జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవిని ప్రసన్నం చేసుకోవడం ద్వారా వారి పట్ల భక్తిని ప్రదర్శించడం ద్వారా భగవంతుని అనుగ్రహం పొందడం ఈ ఆచారం యొక్క ప్రధాన లక్ష్యం.సహస్రధార స్నానం అనంతరం జగన్నాథ ఆలయంలో స్వామివారి దర్శనానికి అనుమతి ఉండదు. ఈ సమయంలో ఆలయ ప్రధాన గర్భగుడి తలుపులు మూసివేయబడతాయి. భక్తులు స్వామిని దర్శనం చేసుకోలేరు. ఇది దేవుని విశ్రాంతి సమయంగా పరిగణించబడుతుంది. ఇలా చేయడం వెనుక ఉన్న నమ్మకం ఏమిటంటే జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రా దేవిలు స్నానం చేయడం వల్ల జ్వరం వస్తుందని నమ్ముతారు. ఈ కాలాన్ని 'అనవాసర' లేదా 'అజ్ఞాతవాసం అని అంటారు. ఇలా 14 రోజుల పాటు స్వామివారి గర్భగుడి తలుపులు ముసి వేస్తారు.ఈ 14 రోజులు జగన్నాథ, బలరామ, సుభాద్రల విగ్రహాలను పునఃస్థాపన చేస్తారు. విగ్రహాలకు చందనం పూత పూసి ప్రత్యేక మందులతో చికిత్స చేస్తారు. ఇది దేవుని కొత్త జీవితాన్ని పొందే సమయంగా పరిగణించబడుతుంది.14 రోజుల తర్వాత ఆషాఢ మాసంలోని శుక్ల పక్షం ప్రతిపాద తిథి నాడు 15వ రోజున ఆలయ తలుపులు తిరిగి తెరవబడతాయి. ఈ ప్రత్యేకమైన రోజును కన్నుల పండుగగా జరుపుకుంటారు. ఈ ఆచారంలో జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి విగ్రహాలు కొత్త కన్నులు అందించబడతాయి. ఈ రోజున నేత్రోత్సవం అని అంటారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన జగన్నాథ రథయాత్ర ప్రారంభమవుతుంది. ఈ రథయాత్ర సమయంలో భగవంతుడు జగన్నాథుడు, బలరాముడు, సుభద్ర దేవి భారీ రథాలలో కూర్చుని వీధుల్లో ఊరేగుతారు. ఈ భారీ రథాలను వందలాది మంది భక్తులు లాగుతారు.

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుల పాలాభిషేకం



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండల కేంద్రంలోనీ బస్టాండ్ లో గల తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రెట్కతులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఆమోదం తెలిపినందుకు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## యువత మాదక ద్రవ్యాలకు బానిస కావద్దు



**వాస్తవ నేస్తం,భీంపూర్:** యువత మాదక ద్రవ్యాలకు బానిస అయి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని జైనథ్ సిఐ సాయినాథ్ తెలిపారు. శనివారం మండలంలోని బెల్సరి రాంపూర్ గ్రామంలో భీంపూర్ ఎస్సై మొహమ్మద్ కలీంతో కలసి మాదక ద్రవ్యాల నిర్మూల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గంజాయి సాగు చేయడం, వినియోగించడం, విక్రయించడం, రవాణా చేయడం చట్ట రీత్యా నేరం అని తెలిపారు. గంజాయి వల్ల కలిగే అనర్థాల పై,సాగు చేస్తే ఎలాంటి చట్టపరమైన చర్యలు ఉంటాయో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రూప శంకర్,విజయ్,పోలీస్ సిబ్బంది,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భాగం బాగేశ్వరరావుకు నివాళులర్పించిన వాసిరెడ్డి రామనాథ



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల పరిధిలోని గోవిందపురం (ఏ) గ్రామానికి చెందిన టిడిపి జిల్లా నాయకులు భాగం రమేష్ తండ్రి టిడిపి సీనియర్ నాయకులు భాగం భాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా శనివారం దశదిన కర్మ సందర్భంగా వారి చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.వారి వెంట నివాళులర్పించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ, తెదేపా నాయకులు గడ్డం రమేష్, నందమూరి సత్యనారాయణ, తూము పురుషోత్తరావు,సంద్ర ప్రసాద్ మామిళ్ల నరసింహారావు,పారా వెంకటేశ్వర రావు, మండేపూడి గోర్కె,మండేపూడి మోహన్ రావు, ఏసుపోగు నాగేశ్వరరావు పాటిబండ్ల సుబ్బారావు, సాదినేని కొండలరావు, కంచర్ల చిన్నప్ప తదితరులు ఉన్నారు.

## శనిగరం గ్రామంలో 60,000 వేల లీటర్ల వాటర్ ట్యాంకు

**భూమి పూజ చేసిన కోహెడ ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్**

**కోహెడ :** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామంలో 60,000 వేల లీటర్ల వాటర్ ట్యాంకు మిషన్ భగీరథ 30 లక్షల రూపాయలతో అదనపు ట్యాంక్ నిర్మాణం భూమి పూజ చేసిన కోహెడ ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్,కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీపీ కీర్తి సురేష్ మాట్లాడుతూ గ్రామంలో గ్రామ ప్రజలకు నీటి కొలువ లేకుండా 60,000వేల లీటర్ల ట్యాంక్ ను మిషన్ భగీరథ ద్వారా 30 లక్షల రూపాయలతో అదనపు ట్యాంకుకు భూమి పూజ నిర్మాణం చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం గ్రామంలోని సబ్ సెంటర్ ను విజిట్ చేశారు వారు సబ్ సెంటర్ వారితో మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు ప్రసవించిన బాలింతలకు మంచి పోషకాహారం అందించాలని పోషకాహారంద్వారా పుట్టబోయే బిడ్డ తల్లి ఇద్దరు బలంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొంపెల్లి స్వప్న శశిధర్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రనాయకుడు కర్ర శ్రీహరి మాజీ సర్పంచ్ లు కర్ర రవీందర్ గాదె శ్రీధర్ మిషన్ భగీరథ డీ ఈ రుహిన, ఏ ఈ ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి చంద్రం కర్ర భిక్షపతి, ప్రతాపరెడ్డి, అనిల్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## క్లినికల్ అవేర్ నెస్ వాక్

**హైదరాబాద్ :** ఆరోగ్యకరమైన జీవితం అందరికీ అవసరం. హెల్తీగా ఉంటేనే ఏదైనా చేయగలం. అలాంటి ఆరోగ్యంపై మరింత అవగాహన కల్పించేందుకు ఇండియన్ ఫార్మాకోపియల్ అసోసియేషన్ కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ఫార్మా ఫ్లైడ్ పేరిట క్లినికల్ అవేర్ నెస్ వాక్ నిర్వహించింది. జూలై 5 నుంచి 7 వరకు హైదరాబాద్ లో జరిగే 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ (ఐ.పి.సి)లో భాగంగా ఈ ఈవెంట్ చేపట్టారు. " రోల్ ఆఫ్ ఇండియన్ ఫార్మా ఫర్ గ్లోబల్ వెల్ బీయింగ్ " అనేది ఈ సారి ఐ.పి.సి థీమ్ గా నిర్ణయించారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com